

ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసిన సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

# కేటీఆర్‌కు మరో అంతర్జాతీయ ఆహ్వానం

- మాస్కో సదస్సుకు ఆహ్వానించిన స్కోల్‌కోవో సంస్థ
- ఫెస్టివల్ ఆఫ్ ఫ్యూచర్ సదస్సులో ప్రసగించాలని విన్నపం
- వచ్చే 5 నుంచి 7 వరకు మాస్కోలో ప్రతిష్ఠాత్మక సదస్సు
- ఆవిష్కరణల్లో కేటీఆర్ కృషి అద్భుతమని కితాబు




హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరోసారి అరుదైన గౌరవం దక్కింది. రష్యాలోని మాస్కోలో తాము నిర్వహించే ప్రతిష్ఠాత్మక ఈవెంట్‌లో ప్రసంగించాలని ఆయనకు స్కోల్‌కోవో సంస్థ ఆహ్వానం పంపింది. 'ఫ్యూచరిస్టిక్' అనే అంశంపై భవిష్యత్తు అవకాశాలు, వినియోగించుకునే విధానాలపై ప్రసంగించాలని కేటీఆర్‌కు ప్రత్యేక ఆహ్వానం పంపడం విశేషం. రష్యా ప్రభుత్వం ఆధ్వర్యంలో 2024 సెప్టెంబర్ 5 నుంచి 7 వరకు 'ఫెస్టివల్ ఆఫ్ ది ఫ్యూచర్ పోర్టల్ 2030-2050' లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

**కేటీఆర్ కృషి అద్భుతం**

తెలంగాణలో కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించే విషయంలో కేటీఆర్ చేసిన కృషి అద్భుతమని ఆహ్వాన పత్రికలో స్కోల్‌కోవో ఫౌండేషన్ నిర్వాహకులు అభినందించారు. 'మీకు ఉన్న అనుభవాన్ని మాతో పంచుకునేందుకు మిమ్మల్ని ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంచుకున్నాం. మీ రాక మాకు ఎంతో గౌరవం' అని నిర్వాహకులు కేటీఆర్‌ను ప్రశంసించారు.

కార్యక్రమం ద్వారా 2030-2050 ప్రముఖ శాస్త్రవేత్తలు, భవిష్యత్తు శాస్త్రవేత్తలు, కళారంగానికి చెందిన పలు రంగాల ప్రముఖులను ఒక్కచోటుకు తీసుకొచ్చి భవిష్యత్తు తరానికి ఓ వేదికను అందించడమే తమ ఉద్దేశమని నిర్వాహకులు పేర్కొన్నారు. సదస్సులో ఫ్యూచరాలజిస్టులు, ప్రపంచస్థాయి మేధావులు, శాస్త్రవేత్తలు, టెక్నాలజీ రంగ దిగ్గజాలు, పారిశ్రామికవేత్తలు పాల్గొంటారు. భవిష్యత్తులో మరింత మెరుగైన అవకాశాలను సృష్టించడంపై చర్చిస్తారు. ఈ వేదిక టెక్నాలజీ, ఆర్థికరంగంలో ఉన్నత అవకాశాలు కల్పించేందుకు ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. స్టార్టప్ ప్రాజెక్టులను సిద్ధం చేసిన విద్యార్థులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు సరైన అవకాశాలు కల్పించేందుకు తోడ్పడుతుందని మాస్కో స్కోల్‌కోవో సంస్థ వెల్లడించింది.

**లోకం పోకడ**




# సాగులో ముందడుగు వేయాలి

- సౌర విద్యుత్తుపై రైతులకు అవగాహన కల్పించాలి
- వరంగల్ నగరం నిరంతర సుస్థిరాభివృద్ధి సాధించాలి
- వరంగల్ జిల్లా పర్యటనలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ




ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం లక్నవరం సరస్సులో బోటులో ప్రయాణిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి సీతక్క, అధికారులు

వరంగల్/ములుగు, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): వ్యవసాయ రంగంలో తెలంగాణ ముందుండాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. పీఎం కుసుమ్ యోజన ద్వారా సౌర విద్యుత్తును వినియోగించుకునేందుకు కేంద్రప్రభుత్వం కృషి చేస్తున్నదని చెప్పారు. సౌర విద్యుత్తుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. వరంగల్ చారిత్రక, వారసత్వ నగరమని, కాకతీయ రాజుల సామ్రాజ్య నగరంగా వరంగల్‌కు ఘనమైన చరిత్ర ఉన్నదని చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ బుధవారం నగరంలో పర్యటించారు. ములుగు జిల్లా లక్నవరం నుంచి ఉదయం రోడ్డు మార్గంలో వరంగల్ నిట్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి హనుమకొండ కలెక్టరేట్‌కు వచ్చారు. కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. చారిత్రక, వారసత్వ సంపద కలిగిన వరంగల్ నగరం మరింత సుస్థిరాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. వరంగల్‌లో వందల ఏండ్ల నాటి వారసత్వ కట్టడాలు అద్భుతంగా ఉన్నాయని, కాకతీయుల కాలంనాటి శిల్ప సంపద అపూర్వమని, నాటి కట్టడాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉన్నదని పేర్కొన్నారు. రామప్ప, వేయి స్తంభాల దేవాలయం వంటి ఎన్నో అత్భుత కట్టడాలను చూడటం మరిచిపోలేని అనుభూతినిచ్చిందని చెప్పారు. హనుమకొండలోని వేయి స్తంభాల ఆలయంలో ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ పూర్ణకుంభ స్వాగతం పలికారు. అక్కడి నుంచి భద్రకాళీ అలయానికి వెళ్లి అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం ఖిలావరంగల్‌లోని కాకతీయుల రాజధానిగా ఉన్న చారిత్రక ప్రాంతానికి వెళ్లారు. అక్కడ కాకతీయ రాజుల కాలం నాటి శిల్ప సంపదను, కట్టడాలను తిలకించారు. పురవస్తు శాఖ అధికారులు అక్కడి కట్టడాల గురించి గవర్నర్‌కు వివరించారు. కవులు, రచయితలు, క్రీడాకారులు, సామాజిక కార్యకర్తలు, జాతీయ, రాష్ట్ర స్థాయిలో వివిధ రంగాలలో అవార్డులు పొందిన 40 మందితో గవర్నర్ చర్చా గోష్టి నిర్వహించారు. అనంతరం వారితో కలిసి గవర్నర్ భోజనం చేశారు. హనుమకొండలోని రెడ్‌క్రాస్ సంస్థ భవనాన్ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సందర్శించారు. అక్కడ తలసేమియా బాధిత పిల్లలను పరామర్శించారు. కొత్తగా నిర్మించిన రెడ్‌క్రాస్ సంస్థ భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, శాసన మండలి వైస్‌చైర్మన్ బండ ప్రకాశ్, ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, గ్రేటర్ వరంగల్ మేయర్ సుధారాణి, ఎమ్మెల్సీలు బస్వరాజ్ సారయ్య, తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ, కేఆర్ నాగరాజు, కుడా చైర్మెన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం పాల్గొన్నారు.

**ఒక గ్రామాన్ని దత్తత తీసుకుంటా: గవర్నర్**

**బుధవారం** ఉదయం మంత్రి సీతక్క, ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశంతో కలిసి లక్నవరం సరస్సులో గవర్నర్ స్పీడ్ బోటు షికారు చేశారు. ములుగు జిల్లాలో ఒక గ్రామాన్ని దత్తత తీసుకుంటానని ప్రకటించారు. గవర్నర్ పర్యటనకు సహకరించిన కలెక్టర్, పోలీసులు, ప్రజలకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. తిరుగు ప్రయాణంలో గవర్నర్ ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాను సందర్శించి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. విషపురుగు కాటుకు గురైన కానిస్టేబుల్‌ను పరామర్శించారు.

## మాట నిలబెట్టుకున్న కేటీఆర్



కేటీఆర్ మరోసారి మంచి మనసు చాటుకున్నారు. ప్రేమోన్మాది చేతిలో తల్లిదండ్రులను కోల్పోయిన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం 16చింతలతండాకు చెందిన దీపిక, మదన్‌కు రూ.5 లక్షల సాయం చేస్తానని వారిని పరామర్శించిన సందర్భంగా మాటిచ్చారు. మాట ప్రకారం.. రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దంపతుల ద్వారా బుధవారం నర్సంపేటలో బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. - చెన్నారావుపేట

## మోదీ ఫ్లెక్సీ దహనం..



మద్యం పాలసీ కేసులో కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం మోదీనేనని ఆరోపిస్తూ బుధవారం ఆయన ఫ్లెక్సీని బీఆర్‌ఎస్ కార్యకర్తలు దహనం చేశారు. కవితకు బెయిల్ మంజూరు కావడంతో రాష్ట్ర నాయకుడు సయ్యద్ మసూద్ ఆధ్వర్యంలో కార్యకర్తలు వరంగల్ మండిబజార్‌లో స్వీట్లు పంచారు. -గిర్మాజీపేట

# బదిలీలు, పదోన్నతుల్లో తప్పులు సవరించండి

- డిస్‌లొకేట్, 317 బాధితులకు న్యాయం చేయండి
- ఏటీజీఆర్‌ఈఐఈడబ్ల్యూ అసోసియేషన్ డిమాండ్
- సీఎంవోలో ఉన్నతాధికారులకు వినతిపత్రం

హైదరాబాద్, ఆగస్టు28 (నమస్తే తెలంగాణ): సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీలో ఇటీవల చేపట్టిన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో అనేక తప్పులు దొర్లాయని, ఫలితంగా టీచర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే వాటిని సవరించాలని ఆల్ తెలంగాణ గవర్నమెంట్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏటీజీఆర్‌ఈఐఈడబ్ల్యూఏ) డిమాండ్ చేసింది. డిస్‌లొకేట్, 317 జీవో బాధిత ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులకు, పలువురు మంత్రులకు, సాంఘిక సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి అసోసియేషన్ అధ్యక్షుడు కూకుట్ల యాదయ్య, జనరల్ సెక్రటరీ పాపిరెడ్డి, ట్రెజరర్ బసవయ్య బుధవారం వినతిపత్రం అందజేశారు. ఉన్నతాధికారులకు సమస్యలు విన్నవించారు. అన్ని సొసైటీల్లో జీవో 80 ప్రకారం వెబ్ కౌన్సిలింగ్‌ను నిర్వహిస్తే, అందుకు విరుద్ధంగా సోషల్ వెల్ఫేర్ సొసైటీ మాన్యువల్ కౌన్సిలింగ్ చేపట్టిందని, ఫలితంగా గందరగోళం నెలకొన్నదని తెలిపారు. కామన్ సీనియార్టీ జాబితా వల్ల అనేక మంది టీచర్లు డిస్‌లొకేట్ అయ్యారని, సబ్ కమిటీ నివేదిక రాకముందే 317 జీవో ద్వారా ఉద్యోగులను రిలీవ్ చేశారని వాపోయారు. ప్రభుత్వ అనుమతి లేకుండానే నిబంధనలకు విరుద్ధంగా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పోస్టులకు ప్రమోషన్లు కల్పించారని తెలిపారు. మొత్తంగా బదిలీలు, పదోన్నతులపై సమగ్ర విచారణ జరపాలని, నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# కొనుగోలు కేంద్రాలు పెట్టరా?

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు బహిరంగ లేఖ

- మార్క్‌ఫెడ్ సెంటర్ల ఏర్పాటులో ఇంత నిర్లక్ష్యమా?
- పప్పు దినుసుల రైతుల ఆశలు అడియాసలైనయ్
- పెసర క్వింటాల్‌పై 2500 నష్టపోతున్నరు
- ప్రభుత్వంపై హరీశ్‌రావు మండిపాటు



హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు తక్కువ ధరకు పంటను అమ్ముకోవాల్సి వస్తున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ సీఎం రేవంత్‌రెడ్డికి బుధవారం బహిరంగ లేఖ రాశారు. పప్పు దినుసుల సాగుతో మెరుగైన లాభాలు సాధించవచ్చునుకున్న రైతుల ఆశలు అడియాసలయ్యాయని చెప్పారు. 'కేంద్రం ఈ ఏడాది క్వింటాలు పెసరకు మద్దతు ధర రూ.8,682 ప్రకటించినా ఆ ధరకు ఎవరూ కొంటలేరు. చేసేది లేక రైతులు వ్యాపారులకు రూ.6,000 నుంచి రూ.6,500కే అమ్ముకుంటున్నరు. దీంతో క్వింటాల్‌పై రూ.2,500 పైగా నష్టపోతున్నరు' అని లేఖలో పేర్కొన్నారు. వ్యాపారులు మద్దతు ధరకు పంట కొనుగోలు చేయని పరిస్థితుల్లో గత కేసీఆర్ ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. దీంతో మార్కెట్‌లో పోటీ ఏర్పడి వ్యాపారులు కూడా ఎక్కువ చెల్లించి కొనుగోలు చేశారని చెప్పారు. ఈ సంవత్సరం మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. 'ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడం పెసర రైతులకు శాపంగా మారింది. ఖమ్మం, మహబూబాబాద్, వికారాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, నారాయణపేట, సూర్యపేట తదితర జిల్లాల రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నరు' అని తెలిపారు. రుణమాఫీ, రైతుబంధును అటకెక్కించారని, వరికి రూ.500 బోనస్ మాటను బోగస్ చేశారని, ఇప్పుడు మద్దతు ధరకు కొనుగోలు బాధ్యతను విస్మరించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా కండ్లు తెరిచి వ్యవసాయ, రైతు వ్యతిరేక విధానాలను వీడాలని, మార్క్‌ఫెడ్ కేంద్రాలు పెట్టి పెసర దిగుబడులు కొనాలని డిమాండ్ చేశారు.

## కొడంగల్‌లో బడుల మూత సిగ్గుచేటు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ఉపాధ్యాయులు లేక పాఠశాల మూతపడటం సిగ్గుచేటని హరీశ్‌రావు బుధవారం ఎక్స్ వేదికగా ఎద్దేవా చేశారు. 15 రోజుల నుంచి పాఠశాల నడవకున్నా ఎవరూ పట్టించుకోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.

'**ప్రతి మండలంలో** ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేస్తామని మ్యానిఫెస్టోలో చెప్పి, ఇప్పుడు ఉన్న ప్రభుత్వ స్కూళ్లను మూతపడేలా చేస్తున్నారు. పేద పిల్లలకు ప్రాథమిక విద్యను దూరం చేస్తున్నారు. పాఠశాలలు మూతపడుతుంటే ప్రభుత్వం ఏం చేస్తున్నట్లు? విద్యాశాఖ సీఎం వద్దే ఉన్నా ఎందుకు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నట్టు?' అంటూ ప్రశ్నించారు. తక్షణమే వలంటీర్లను నియమించి పాఠశాలలను మూతపడకుండా చూడాలని డిమాండ్ చేశారు.

# రేవంత్ సీఎం కావడం మోదీ చాయిస్

- చరిత్రలో పరమ చెత్త కేసుల్లో లిక్కర్ కేసు ఒకటి
- నిరాధార కేసు అని మొదటి నుంచి చెబుతున్నా పట్టించుకోని సీబీఐ, ఈడీ
- కవిత కడిగిన ముత్యంలా బయటకు వచ్చారు
- ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ) : రేవంత్‌రెడ్డి సీఎం కావడం ప్రధాని మోదీ చాయిసేనని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ మోదీకి బీటీమ్‌గా పనిచేస్తున్నదని, మోదీ దగ్గర రేవంత్‌కు ఉన్న ప్రాధాన్యత కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కు లేదని తెలిపారు. బుధవారం ఆయన సూర్యాపేటలో మీడియాతో మాట్లాడారు. చరిత్రలో సీబీఐ, ఈడీ నమోదు చేసిన వాటిల్లో లిక్కర్ కేసు పరమ చెత్తదని వ్యాఖ్యానించారు. కోర్టులో సాక్ష్యాలపై న్యాయమూర్తి అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక సీబీఐ, ఈడీ తరపు న్యాయవాదులు తటపటాయించడం చూస్తుంటే రాజకీయపరంగా పెట్టించిన కేసు అనేది మరోసారి నిర్ధారణ అయిందని తెలిపారు. ఈ కేసు నిరాధారమైనదని బీఆర్‌ఎస్ తరపున తాము మొదటి నుంచి చెబుతున్నామని పేర్కొన్నారు. ఎవరో చెప్పారని అరెస్టు చేసి జైలులో పెట్టినప్పటికీ కోర్టులో కవితకు న్యాయం జరిగిందన్నారు. తాము ఊహించినట్టుగానే కవిత కడిగిన ముత్యంలా బయటకు వచ్చారని, చిన్న ఆధారం లేకుండా, ఎవరూ ఫిర్యాదు చేయకపోయినా, కేవలం రాజకీయ ఒత్తిళ్లతో సీబీఐ, ఈడీ చేసిన ప్రయత్నమని బహిరంగంగా అర్థం అవుతుందని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్, కేజ్రీవాల్‌ను ఇబ్బంది పెట్టడానికే ఈ కేసు పెట్టారని ఆరోపించారు. నోట్ల కట్టలతో, వీడియోలతో పట్టపగలు దొంగగా దొరికి అధికారం చలాయిస్తున్న వారికి నిరాధార కేసులో కవిత బెయిల్‌పై వస్తే ఏడుపెందుకని ప్రశ్నించారు. లిక్కర్ కేసులో రాహుల్, రేవంత్ తొలి నుంచి విరుద్ధంగా మాట్లాడుతున్నారని, ఢిల్లీలో లిక్కర్ కేసు ఫేక్ అని రాహుల్ అంటే.. అదే కేసుపై తెలంగాణలో రేవంత్ మాత్రం కుంభకోణం అంటాడని, ఇదేం కాంగ్రెస్సో, వారేం నాయకులో అర్థం కావడం లేదని మండిపడ్డారు. ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ వైఫల్యాలపై మాట్లాడని బీజేపీ ఇంకా రాష్ట్రంలో బీఆర్‌ఎస్సే అధికారంలో ఉన్నట్టు భావిస్తున్నదని, అందుకే తమ పార్టీపైనే దాడి చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. దీని ద్వారా వారి బలహీనతలు, వారి ఐక్యత అర్థం అవుతుందని అన్నారు. కర్ణాటకలోని వాల్మీకి కుంభకోణంలో టీ కాంగ్రెస్ నేతల ప్రమేయం ఉన్నా బీజేపీ నేతలు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు.


**J.B. INSTITUTE OF ENGINEERING & TECHNOLOGY**
(UGC AUTONOMOUS) EAPCET CODE : JBIT
(Accredited by NBA & NAAC, Approved by AICTE & Permanently Affiliated to JNTUH)
Bhaskar Nagar, Yenkapally (V), Moinabad (M), R.R.District, Hyderabad-075.
Website: www.jbiet.edu.in Ph: 958417-235127 / 9908058222 / 9989623333.
**SPOT ADMISSIONS TGEAPCET - 2024-25**

| COURSES | ECE | ECM | CIVIL | MECH | EEE |
|---|---|---|---|---|---|

Eligible candidates can attend for the spot admission in the college premises along with Original Certificates and two sets of photocopies on 30-08-2024. Admissions will be made as per guidelines given by Convener TGEAPCET-2024. For more details, visit our website: www.jbiet.edu.in
Hostel Facility available for boys and girls | Transport facility available
Note: Fee Reimbursement is not applicable for Spot Admissions. Sd/- PRINCIPAL



**BHASKAR ENGINEERING COLLEGE**
EAPCET Code : BSKR
(Approved by AICTE & Permanently Affiliated to JNTUH, Hyderabad)
Bhaskar Nagar, Yenkapally (V), Moinabad (M), R.R. District, Hyderabad - 075.
Ph:8008096774 / 9704095666, Website: www.bec.edu.in
**SPOT ADMISSIONS TGEAPCET-2024-25**

| COURSES : | CSE | CSM | AID | INF | ECE |
|---|---|---|---|---|---|

Eligible candidates can attend for the Spot admission in the college premises along with Original Certificates and two sets of photocopies on or before 02-09-2024. Admissions will be made as per guidelines given by the Convener, TGEAPCET-2024. For more details, visit our website: https://www.bec.edu.in
Hostel Facility available for boys and girls | Transport facility available
Note: Fee Reimbursement is not applicable for Spot Admissions. Sd/- PRINCIPAL



